క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట: పట్టణంలోని మద్దినగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి, మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణంలోని పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏడీఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని మద్దినగర్, దాసరికాలనీ, రహమత్ నగర్, గవర్నమెంట్ ఆసుపత్రి లైను ప్రాంతాల్లో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మిగులు భూములపై వినతి

యడ్లపాడు: మండలం పరిధిలోని మిగులు భూముల్ని అధికారులు గుర్తించి ఎస్సీ,ఎస్టీలకు పంపిణీ చేయాలని కోరుతూ శుక్రవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక విన్నవించారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రెవెన్యూ అధికారులకు వారు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి శ్రీనునాయక్, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు వి.శ్రీనివాసనాయక్, ఎస్సీ,ఎస్టీ నాయకులు కారసాల పిచ్చయ్య, ఏడ్లూరి నాగేశ్వరరావు, యమర్తి సుబ్బారావు, కారసాల కమలబాబు, పాలపర్తి శ్రీనివాసరావు, కె.వాగ్యానాయక్, దేవర డేవిడ్ పాల్గొన్నారు.

వెల్లటూరులో ధాన్యం కొనుగోళ్లు

బొల్లాపల్లి: పౌర సరఫరాలు, మార్కెటింగ్ శాఖ, వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో గతేడాది మండలంలోని వెల్లటూరు మార్కెటింగ్ గొడౌన్‌లలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశారు. రబీ సీజన్లలో ధాన్యం కొనుగోలులో విరుగుడు శాతం అధికంగా ఉందని కోత విధించారని స్థానిక రైతులు కొందరు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు విన్నవించుకున్నారు. ఎమ్మెల్యే ధాన్యం కొనుగోలులో వ్యత్యాసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో అధికారులు స్పందించి శుక్రవారం వెల్లటూరు గొడౌన్‌ను సందర్శించి రైతులకు న్యాయం చేశారు. అధికారులు వి.సి.హెచ్. సత్యనారాయణ, ఆర్.నరసింహారావు, శ్రీనివాసరావు, మండల కో ఆప్షన్ మెంబరు ఎస్‌కె మౌలాలి రైతులు పాల్గొన్నారు.

బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

చిలకలూరిపేట: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో చట్టబద్ధత కల్పించాలని పల్నాడు జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు అద్దంకి బాబుమాదిగ డిమాండ్ చేశారు. ఆగస్టు రెండో తేదీన నిర్వహిస్తున్న హలో మాదిగ– చలో హైదరాబాద్ కార్యక్రమ సన్నాహక సమావేశం పట్టణంలోని సీపీఐ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. ఆగస్టు రెండో తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే విశ్వరూప మహాసభలో మాదిగల సత్తా ఎంటో చూపిస్తామని చెప్పారు.

టీడీపీ కౌన్సిలర్‌పై కుక్కల దాడి

నాదెండ్ల: గణపవరం గ్రామానికి చెందిన కౌన్సిలర్, ప్రతిపక్ష నాయకుడు గంగా శ్రీనివాసరావుపై శుక్రవారం మధ్యాహ్నం కుక్కలు దాడి చేయటంతో గాయాలయ్యాయి. మధ్యాహ్నం సమయంలో తన ద్విచక్రవాహనంపై చిలకలూరిపేటలోని ఆర్‌వీఎస్ స్కూల్ రోడ్డులో వెళ్తుండగా, వీధికుక్కలు పరుగెత్తుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాయి. దీంతో ఆయన అదుపుతప్పి కిందపడటంతో కుడిచేయికి గాయాలయ్యాయి. స్థానికులు గమనించి పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు.

మొహర్రం సంతాప దినాలు

యడ్లపాడు: మొహర్రం పండుగ మూడోరోజున యడ్లపాడు మండలంలోని పలు పీర్ల చావిడిల్లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు ముజావర్లు నిర్వహించారు. చంద్రవంక దర్శనంతో మొహర్రం నెల బుధవారం ప్రారంభమైంది. మొహర్రం నెల ప్రారంభానికి సూచికగా యడ్లపాడు మండలంలోని పలు ప్రాంతాల్లో పంజాలను ముజావర్లు పీర్ల చావిళ్లలో నిలబెట్టారు. తిమ్మాపురం, యడ్లపాడు, కారుచోల, బోయపాలెం, కోట, కొండవీడు ప్రాంతాల్లో మొహర్రం పురస్కరించుకుని పీర్ల పండుగను నిర్వహించుకున్నారు.

డీఎల్‌డీవో తనిఖీలు

ఈపూరు: మండలంలోని కొచ్చర్ల, కొండ్రముట్ల గ్రామసచివాలయాలను నరసరావుపేట డీఎల్‌డీవో వెంకటరెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఎల్‌డీవో వెంకటరెడ్డి సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించాలని, సచివాలయ పరిధిలో ప్రతి ఒక్కరూ ప్రజలకు అందుబాటులో ఉండి అవసరమైన సర్వీసులను వెంటనే పరిష్కరించే విధంగా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ఎనిమిక్ ఉన్న వారిని గుర్తించి సచివాలయ సిబ్బంది మ్యాప్ చేసుకొని వారికి మంచి పోషకాహారం అందేవిధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

నాణ్యమైన మిరపనారు అందించాలి

చిలకలూరిపేట: రైతులకు నాణ్యమైన మిరపనారును మాత్రమే అందించాలని ఉద్యాన అధికారి ఎన్.కిషోర్ చెప్పారు. మండలంలోని రాజాపేట గ్రామంలో షెడ్‌నెట్ నర్సరీలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యమైన నారు ద్వారా మాత్రమే ఆశించిన దిగుబడులు సాధ్యమౌతాయని వెల్లడించారు. రైతులు కూడా ప్రతి కొనుగోలుకు సంబంధించి తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. నర్సరీ యజమానులు తప్పనిసరిగా 2010 నర్సరీ చట్టం ప్రకారం లైసెన్సులు తీసుకోవాలని చెప్పారు. అంతేకాకుండా రికార్డులను తప్పనిసరిగా నిర్వహించాలని తెలిపారు. లేనిచో శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు పూర్ణ రామకృష్ణ, వ్యవసాయ సహాయకులు సురేష్ పాల్గొన్నారు.

వలంటీర్ల వ్యవస్థను బలపర్చాలి

- వాలిపై అవాకులు చవాకులు తగదు
- ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- క్రిస్టియన్‌పాలెం జగనన్న సురక్ష కార్యక్రమం



క్రిస్టియన్‌పాలెంలో లబ్ధిదారురాలికి ఇంటిపట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: వలంటీర్లు ప్రజలకు చేస్తున్న మేలును దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ ఆ వ్యవస్థను బలపర్చాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు. శుక్రవారం ఐదో వార్డు క్రిస్టియన్ పాలెంలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల ఎజ్రా అధ్యక్షత నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. వలంటీరు వ్యవస్థపై జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ అవాకులు చవాకులు మాట్లాడుతున్నాడన్నారు. ఒక మహిళ కన్పించకుండా పోతేనే తీవ్రంగా ప్రభుత్వం భావిస్తుందని, అయితే రాష్ట్రంలో వలంటీర్ల వల్ల 18 వేల మంది మహిళలు కన్పించకుండా పోయారంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యమైనవన్నారు. ప్రజలకోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వారి ముంగిటకు తీసుకెళ్లటంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు కీలకపాత్ర పోషించటం, దీని వలన ప్రభుత్వానికి వస్తున్న మంచిపేరును దృష్టిలో పెట్టుకున్న ఎల్లోమీడియా, పవన్ కల్యాణ్, చంద్రబాబు ఈ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకొని లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు మళ్లీ అధికారంలోకి వస్తే ఈ రెండు వ్యవస్థలను రద్దు చేస్తాడని ఎమ్మెల్యే గోపిరెడ్డి హెచ్చరించారు. వార్డులో 448 మందికి అమ్మఒడి, 294 మందికి వైఎస్సార్ చేయూత, 344 మంది డ్వాక్రా సంఘీయులకు వైఎస్సార్ ఆసరా అమలౌతుందన్నారు. మరో 266 మందికి ఇళ్లపట్టాలు అందజేశామన్నారు. పట్టణంలో 34 వార్డులు ఉండగా ఏ వార్డులో లభించని సంక్షేమం ఫలం ఈ ఐదో వార్డు లబ్ధిదారులకు రూ.15 కోట్లు ప్రభుత్వం అందజేయటం విశేషమన్నారు. దీని ద్వారా వార్డులో అధికంగా నివాసం ఉండే బడుగు, బలహీన వర్గాల సంక్షేమంపై ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు. వార్డులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మున్సిపల్ స్కూలుకు రూ.36 లక్షలు వెచ్చించి ప్రహరీ, మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు నిర్మించి అభివృద్ధి చేశామన్నారు. దీంతో పాటు మరో రూ.61 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. తమకు ధ్రువపత్రాలు కావాలంటూ 477అర్జీలు రాగా అందులో కుల ధ్రువపత్రాలకోసం 625 మంది, ఆదాయ ధ్రువపత్రాలకోసం 615 మంది దరఖాస్తు చేశారని, వారందరికీ మంజూరు చేయటం జరిగిందన్నారు. సంక్షేమ పథకాలు అందాలన్నా, ప్రజల గడపవద్దకే వచ్చి సేవలు అందజేస్తున్న సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు కొనసాగాలన్నా రాష్ట్రానికి మళ్లీ సీఎంగా జగన్‌ను, నియోజకవర్గ ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఎమ్మెల్యే గోపిరెడ్డి కోరారు. ఈ సందర్భంగా వార్డులోని డ్వాక్రా సంఘీయులకు ప్రభుత్వం అమలుచేసిన రుణమాఫీ నిధులు రూ.9 కోట్ల చెక్కును వారికి అందజేశారు. డ్వాక్రా స్టాల్‌ను ప్రారంభించి వారి ఉత్పత్తులను తిలకించారు. కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేకు వార్డు ప్రజలు ఘన స్వాగతం పలికారు. మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్, ఎం.ఇ డి.శ్రీనివాసరావు, షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, ముదిరాజు, గిరిజన కార్పొరేషన్ల డైరెక్టర్లు ఇయం.స్వామి, పాలపర్తి వెంకటేశ్వరరావు, ఎస్సీసెల్ జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యుడు మల్లెల అశోక్, ఆంధ్రా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కాల్వ రవిమాదిగ, టౌన్‌బాప్టిస్టు చర్చి కమిటీ అధ్యక్షుడు పంగులూరి విజయకుమార్, మేరిబాబు, ద్వారక, మల్లెల అనీల, సయ్యద్‌ఫాతిమా, కుక్కల పౌలు, యాకోబు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



కొండవీడు సురక్ష సదస్సులో సర్టిఫికెట్ అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



లబ్ధిదారులకు పత్రాలు అందిస్తున్న సర్పంచ్ రమాదేవి, జెడ్పీటీసీ మస్తాన్‌రావు, ఎంపీపీ రాణి

కొండవీడులో జగనన్న సురక్ష సదస్సు

యడ్లపాడు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న జనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కారం అవుతున్నాయని ఎంపీడీవో హనుమారెడ్డి చెప్పారు. మండలంలోని కొండవీడు గ్రామ సచివాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష సదస్సు అధికారులు నిర్వహించారు. అర్హత కలిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందని వారంటూ ఉండరాదని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఇందులో భాగంగా సచివాలయాల పరిధిలో ఉన్న ప్రజలకు 11 రకాల ధ్రువ పత్రాలను వెంటనే లబ్ధిదారులకు ఉచితంగా మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్, రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, కుల, ఆదాయ, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, మ్యూటేషన్లు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, ఆధార్ కార్డుకు ఫోన్ నంబర్ అనుసంధానం తదితర సేవలు అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం కొత్తపాలెం, కొండవీడు గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు ఎంవీ సుబ్బారావు, షేక్ మొహమ్మద్ యూనీస్, సచివాలయ మండల కన్వీనర్ రాచమంటి చింతారావు, పీఏసీఎస్ చైర్మన్ బసెల శివరామకృష్ణ చేతుల మీదుగా 136 సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వరూధిని, ఆర్‌డబ్ల్యూఎస్ శ్రీనివాసరావు, పీఆర్ ఏఈ శ్రీనివాసరావు, కార్యదర్శి చిన అక్కయ్య గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఇర్లపాడులో...

నాదెండ్ల: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరి దరిచేరాలన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించినట్లు జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు చెప్పారు. మండలంలోని ఇర్లపాడు గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సచివాలయం పరిధిలోని అమీన్‌సాహెబ్‌పాలెం, అప్పాపురం గ్రామాలకు చెందిన లబ్ధిదారులు హాజరయ్యారు. సర్పంచ్ మంగు రమాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గత కొద్దిరోజులుగా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది 1920 గృహాలకు గాను 1600 గృహాలు సందర్శించి అర్హులైన 990 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వం మూడు గ్రామాలకు సుమారు రూ.24 కోట్లు అభివృద్ధి, సంక్షేమానికి వెచ్చించిందన్నారు. 17 రకాల ధ్రువపత్రాలు ఎలాంటి రుసుము లేకుండా అందిస్తున్నట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా ఎంతో మందికి ధ్రువపత్రాలు అంది వాటి ద్వారా సంక్షేమ పథకాలు పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తలతోటి రాణి, ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, తహసీల్దార్ ఏవీ రమణ, జగనన్న సురక్ష మండల కన్వీనర్ అల్లడి రవికుమార్, నాదెండ్ల, గణపవరం సొసైటీ చైర్మన్లు కురుకుంట్ల వెంకటరెడ్డి, మంగు ఏడుకొండలు, మండల కో ఆప్షన్ మెంబర్ మూసాఇస్లాం, నాయకులు పెరుమాళ్లపల్లి వెంకటేశ్వర్లు, చందవరం అంకిరెడ్డి, లూర్దురెడ్డి, కోయలమూడి సాంబశివరావు, ఒంగూరి కృష్ణమనాయుడు, ధూమాల జోజిబాబు, యన్నం రాంబాబు, ఆలూరి చినపుల్లయ్య, ఆలూరి పెద్దపుల్లయ్య, మంగు కోటేశ్వరరావు, పాటిబండ్ల శేఖర్, గుర్రం ఉపేంద్ర, గద్దె ఆంజనేయులు, బ్రహ్మయ్య, శ్రీనివాసరావు, డీటీ అనురాధ, ఏవో హరిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి మాధవి, వీఆర్వో నాగరాజు పాల్గొన్నారు.

కౌలు రైతు కార్డు అందింది



నాలుగేళ్ల క్రితం నాకు వివాహమైంది. మాది వ్యవసాయ కూలి కుటుంబం. గతంలో వ్యవసాయ పనులు చేసుకునే వాడిని. కౌలు రైతు కార్డు కోసం దరఖాస్తు చేశా. గతంలో రాని కార్డు, ప్రస్తుతం నాకు అందించారు. దీంతో వ్యవసాయ రుణాలు, సబ్సిడీలు, మద్దతు ధరలు పొందేందుకు అర్హత లభించింది. జగనన్న ప్రభుత్వానికి ధన్యవాదాలు.

–ఈర్నపు సునీల్, ఇర్లపాడు.

ధ్రువీకరణ పత్రాలు అందాయి



మా కుటుంబంలో నలుగురు సభ్యులం. వ్యవసాయ కూలీ పనులు చేసుకుని ఉపాధి పొందుతున్నాం. నా సంతానానికి వివాహాలయ్యాయి. ప్రభుత్వం చేయూత పథకం రెన్యువల్ కోసం అధికారులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అడిగి ఉన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో రూపాయి ఖర్చు లేకుండా పిలిచి ధ్రువీకరణ పత్రాలు అందించారు.

–పుల్లగూర పోలేను, ఇర్లపాడు.

పిల్లల చదువుకు పత్రాలు ఉపయుక్తం



నా భర్త జోజిబాబు, నేను కూలి పనులకు వెళ్తుంటాం. మాకు ఇరువురు పిల్లలు 6, 3 తరగతులు చదువుతున్నారు. పిల్లల విద్య, సంక్షేమ పథకాల కోసం కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నాం. శుక్రవారం సచివాలయంలో జగనన్న సురక్ష సభ ఉన్నది, అక్కడకు రండి మీకు పత్రాలు ఇస్తామని సచివాలయ సిబ్బంది ఫోన్ చేశారు. పత్రాలు చేతికిచ్చారు.

–ధూమాల కవిత, ఇర్లపాడు.

బాలికను పరామర్శించిన ఎస్టీ కమిషన్ సభ్యుడు



వినుకొండ(నూజెండ్ల): స్థానిక ఎస్టీ బాలికల వసతి గృహంలో 4వ తరగతి విద్యార్థినీ ప్రమాదవశాత్తు సాంబరు గిన్నెలో పడి తీవ్ర గాయాలపాలైంది. అయితే ఈ ఘటనపై విచారించేందుకు రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్ నాయక్ శుక్రవారం వినుకొండకు వచ్చారు. గత ఆదివారం ఎస్టీ హాస్టల్‌లో చదువుకుంటున్న 4వ తరగతి బాలిక భోజన విరామ సమయంలో విద్యార్థినీల తోపులాట జరిగి కాలుతున్న సాంబరు గిన్నెలో పడింది. అయితే వెంటనే స్పందించిన పాఠశాల సిబ్బంది సదరు బాలికను వినుకొండలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేర్పించారు. సమాచారం తెలుసుకున్న శంకర్‌నాయక్ స్థానిక తహసీల్దార్ కిరణ్‌కుమార్‌తో కలిసి ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించారు. అనంతరం ఎస్టీ బాలికల వసతి గృహాన్ని పరిశీలించి విద్యార్థినులకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పాఠశాల సిబ్బందికి సూచించారు.


రెండవ విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తులు ఆహ్వానం

వినుకొండ టౌన్: ఐటీఐలో చేరేందుకు 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చునని, వినుకొండ రూరల్ విఠంరాజుపల్లి గ్రామ శివారులోని శ్రీ బాలాజీ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ కత్రి వెంకట్ శుక్రవారం తెలియచేశారు. 2023–24 విద్యా సంవత్సరానికి ఐటీఐలో చేరేందుకు, 2023 ఆగస్టు 5న జరగబోయే రెండవ విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 30వ తారీకు సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు దరఖాస్తుతోపాటు తమ 10వ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డ్ నకలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలను జత చేస్తూ, తమ కళాశాలలో దరఖాస్తు చేయాలన్నారు. ఐటీఐ రెండు సంవత్సరాలు పూర్తి చేసిన వారికి ఇగ్నో ఓపెన్ యూనివర్సిటీ ద్వారా ఓపెన్ డిగ్రీ చేసుకునే అవకాశం లభిస్తుందన్నారు. ఇతర వివరాలకు 9440542030, 8341821710, 7702892288 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

మంచినీటి చెరువు పరిశీలన

శావల్యాపురం: సాగర్ జలాలు తాగునీటి అవసరాల కోసం ముందుస్తుగా విడుదల చేయటంతో శావల్యాపురంలోని మంచినీటి చెరువును ప్రజాప్రతినిధులు అధికారులు శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా ఎంపీడీవో పి.సీతారామయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు ఆదేశాలు మేరకు శావల్యాపురంలోని మంచినీటి చెరువుకు మరమ్మతులు సత్వరమే చేయటానికి రంగం సిద్ధం చేశామన్నారు. మంచినీటి చెరువులోని నీటిని బయటకు పంపి నాలుగు రోజుల పాటు ఎండబెట్టి తదుపరి బ్లీచింగ్ చల్లి తదుపరి సాగర్ జలాలతో చెరువును నింపుతామన్నారు. పంచాయతీ నిధులు రూ. లక్ష రూపాయల వ్యయంతో రెండు విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేయటంతో పాటు చిన్నపాటి మరమ్మతులను కూడ పారదర్శకంగా చేయించుతామన్నారు. మండలంలోని గంటావారిపాలెం గ్రామసమీపాన ఉన్న అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు నీరు చేరగానే మండలంలోనీ అన్నీ మంచినీటి చెరువులు కుంటలు వాగులు సాగర్ జలాలతో నింపాలన్నారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మూఢవత్ ఆకాష్, పంచాయతీ కార్యదర్శి మహేష్ ఉన్నారు.

రాకేష్‌కు సాహితీ విద్యారత్న పురస్కారం



నరసరావుపేట ఈస్ట్: పట్టణానికి చెందిన శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుండాల రాకేష్‌కు దుగ్గిరాలకు చెందిన పద్మభూషణ్ గుర్రం జాషువా స్మారక కళాపరిషత్ సంస్థ జాషువా పురస్కారంగా సాహితీ విద్యారత్న బిరుదు ప్రకటించింది. ఈనెల 24వతేదీన జాషువా 51వ వర్ధంతిని పురస్కరించుకొని తెనాలిలో జరగనున్న కార్యక్రమంలో పురస్కారం అందించనున్నట్టు సంస్థ నుంచి ఆహ్వానం అందినట్టు రాకేష్ శుక్రవారం తెలిపారు. విద్యావేత్తగా విద్యాసంస్థను స్థాపించి చిన్నారులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటంతో పాటు కవిగా వ్యాసాలు, కవితలు, కథలు రాసిన రాకేష్ రాష్ట్రంలోని పలు సాహితీ సంస్థల పురస్కారాలు అందుకున్నారు. రాకేష్‌ను పలువురు సాహితీవేత్తలు అభినందించారు.

పాఠశాలలు, వసతి గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి

పెదతురకపాలెంలో భవనాలను పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి




మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ భవనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: పెదతురకపాలెంలోని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్, గిరిజన సంక్షేమ శాఖ బాల, బాలికల పాఠశాల వసతి గృహాల నిర్మాణాలను త్వరలోనే పూర్తిచేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని పెదతురకపాలెంలో అసంపూర్తిగా నిలిచిపోయిన స్కూల్, వసతి గృహాల భవనాలను శుక్రవారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్, గిరిజన బాల, బాలికల వసతి గృహాల నిర్మాణాలను పెదరెడ్డిపాలెంలో ప్రారంభించారని తెలిపారు. దాదాపు రూ.9 కోట్ల అంచనాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్రారంభించిన మైనార్టీ స్కూల్ నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయని తెలిపారు. దీనిపై ఈనెల 25వ తేదీన ఇన్‌చార్జ్ మంత్రి ఆధ్యక్షతన జరగనున్న సమీక్షలో పాఠశాల నిర్మాణాలపై చర్చిస్తామన్నారు. గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాల నిర్మాణాలు 20 శాతం మిగిలిపోయాయని తెలిపారు. కాంపౌండ్ వాల్, క్వార్టర్స్ నిర్మాణాలు పనులు రెండు నెలల్లో పూర్తిచేస్తామన్నారు. మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణాలు పూర్తి చేసేందుకు ఆరు నెలలు సమయం పడుతుందన్నారు. రెండు పాఠశాల భవనాల మధ్యలో నుంచి గ్రామస్తుల రాకపోకలకు ఇబ్బందులకు లేకుండా అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపడతామని తెలిపారు. అలాగే కర్నూలు– గుంటూరు జాతీయ రహదారి నుంచి గ్రామానికి, పాఠశాల భవనాలకు చేరుకునే విధంగా రోడ్డును ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమణానాయక్, మాజీ జెడ్పీటీసీ షేక్ నూరల్ అక్బాల్, సర్పంచ్ షేక్ ఆరిఫ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ తలతోటి రాణి



మాట్లాడుతున్న ఎంపీపీ తలతోటి రాణి

నాదెండ్ల: వర్షాకాలం ప్రారంభమైనందున గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ తలతోటి రాణి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆమె అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వర్షాలు పడుతున్నందున దోమలు ప్రబలి ప్రజలు మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ తదితర రోగాల బారినపడే ప్రమాదం ఉందన్నారు. అధికారులు పారిశుద్ధ్య నిర్వహణ, బ్లీచింగ్, ఫాగింగ్ తదితరాలు క్రమం తప్పకుండా చేయాలన్నారు. వైద్యశాలల్లో సీజనల్ వ్యాధులకు సంబంధించి మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జెడ్పీటీసీ మస్తాన్‌రావు మాట్లాడుతూ మరో 3–4 రోజుల్లో గ్రామాల్లో మంచినీటి చెరువులకు సాగర్ జలాలు చేరనున్నందున పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు సమన్వయంతో చెరువులు నింపుకుని నీటి ఎద్దడిని నివారించాలన్నారు. రైతులకు తైవాన్ ఇంజన్లు అందుబాటులో తేవాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. సాగర్ జలాలు విడుదల కానందున ఖరీఫ్‌కు అవసరమైన సాగు నీరు పెట్టుకునేందుకు కె.మైనర్ కాలువకు త్వరలో మరమ్మతులు చేయాలని ఎన్ఎస్‌పీ అధికారులకు సూచించారు. సాతులూరు ఎంపీటీసీ పాటిబండ్ల ప్రభావతి మాట్లాడుతూ, చందవరం, సాతులూరు మధ్య ఉన్న డొంక రోడ్డులో వాగుపై బ్రిడ్జీ లేకపోవటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, బ్రిడ్జీ నిర్మాణం చేయాలన్నారు. కనపర్రు ఎంపీటీసీ పచ్చవ సీతారామయ్య మాట్లాడుతూ, కనపర్రులో ఇటీవల ప్రభుత్వం జగనన్న కాలనీకి గ్రావెల్ వేసి లెవల్ చేసినందుకు తనకు చెల్లించాల్సిన రూ.5 లక్షలు బిల్లు నేటికీ చెల్లించలేదని వాపోయారు. పలువురు సర్పంచ్‌లు ,ఎంపీటీసీలు గ్రామాల్లో కుక్కల బెడద ఉందని, సమస్యను పరిష్కరించాలన్నారు. ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ స్పందిస్తూ కుక్కల నియంత్రణకు కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలిపారు.ఏవో హరిప్రసాద్ మాట్లాడుతూ, చిరుధాన్యాల సాగుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఖరీఫ్‌లో సాగైన పంటలను త్వరలో ఆర్‌బీకే సిబ్బంది ఈక్రాప్ చేయనున్నందున రైతులు సహకరించాలన్నారు. రైతు భరోసా నగదు జమకాని రైతులు నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పీఎం కిసాన్ నగదు కోసం తప్పనిసరిగా ఈకేవైసీ చేయాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ (నూజెండ్ల): పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అర్హత ఉండి ఇంకా సంక్షేమ ఫలాలు పొందని వారిని గుర్తించడంతో పాటు ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. పట్టణంలోని ఓబయ్య కాలనీ సచివాలయం పరిధిలోని 22వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం నవరత్నాల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన అందిస్తున్నారన్నారు. వినుకొండ పట్టణాన్ని తమదైన శైలిలో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే పట్టణ తాగునీటి సమస్యను పరిష్కారం చేశామని, రానున్న రోజుల్లో రెండుపూటలా తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అలాగే గత పదేళ్లల్లో వినుకొండ ఎలా ఉంది, ఇప్పుడు ఎలా ఉందనే విషయాన్ని ప్రజలే గుర్తించాలన్నారు. పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారంతో పాటు ఎన్ఎస్‌పీ కాలనీలో షాపింగ్ కాంప్లెక్స్‌లు, రైతు బజారు, ప్రభుత్వ బాలికలకు అదనపు తరగతి గదులు, పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలువ అభివృద్ధి, వినుకొండ ఘాట్‌రోడ్డు నిర్మాణం, గిరిప్రదక్షిణం రోడ్డు, మున్సిపల్ స్టేడియం, రైల్వే అండర్ బ్రిడ్జితో పాటు ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఇల్లు లేని నిరుపేదల కోసం 5400 ఇళ్లను జగనన్న కాలనీలో నిర్మిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ స్థలం మంజూరైన ప్రతిఒక్కరూ ఇంటి నిర్మాణం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు అర్హత ఉండి అందలేని వారిని గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అందించడమే గడపగడప ముఖ్యఉద్దేశమని అన్నారు. గత పదేళ్లల్లో టీడీపీ హయాంలో జరగని అభివృద్ధి కరోనా కష్టకాలం ఎదురైనప్పటికీ నాలుగేళ్లల్లో వినుకొండను అభివృద్ధి చేశామని చెప్పారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను కోర్టుల్లో కేసులు వేసి ఆపడం తప్ప మాజీ ఎమ్మెల్యే జీవీ ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా వినుకొండ పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని, ముఖ్యమంత్రి సహాయసహకారాలతో వినుకొండకు రాష్ట్రంలోనే పేరుప్రతిష్ఠలు తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు ప్రయోజనాలను కేంద్రం విస్మరించింది

అఖిలపక్ష రైతు సంఘాల నాయకులు



మాట్లాడుతున్న డాక్టర్ రాజమోహనరావు

చిలకలూరిపేట: కేంద్రప్రభుత్వం 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న వాగ్దానాన్ని విస్మరించి రైతాంగ ప్రయోజనాలను పట్టించుకోవడం లేదని అఖిలపక్ష రైతు సంఘాల నాయకులు ఆరోపించారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అఖిలపక్ష నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో రైతు సంఘాల నాయకులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరికీ ఆహారాన్ని అందిస్తున్న రైతులను ఆదుకోవడంలో కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లోపించిందని, ఫలితంగా రైతులు వ్యవసాయానికి దూరమౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల నిర్వహించిన రైతు సమ్మేళనంలో రైతు పోరాటాలకు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహనరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు, నాయకులు మిరియాల వెంకటరత్నం, బొల్లు శంకరరావు, నాగబైరు రామసుబ్బాయమ్మ, ఎం రాధాకృష్ణ, పేరుబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.